టృ్యాంకర్ల నీరే దిక్కు..!

- మణికొండ మున్సిపల్ పరిధిలో అడుగంటిన భూగర్భ జలాలు
- చాలా వరకు వట్టిపోయిన బోర్లు
- ట్యాంకర్లకు ఫుల్ డిమాండ్
- రెండు రోజులకు డెలివరీ
- ఇదే అదనుగా దండుకుంటున్న ప్రైవేట్ ట్యాంకర్ల యజమానులు
- ఇబ్బందుల్లో ప్రజలు


మణికొండలో నీటి సరఫరాకు సిద్ధంగా ఉన్న ట్యాంకర్లు

మణికొండ: వేసవిలో ఎండలు పెరిగిపోతుండడంతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నీటి కష్టాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చాలావరకు బోర్లు వట్టిపోయాయి. దీంతో మణికొండలో జలమండలితో పాటు ప్రైవేట్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిపోయింది. బుక్ చేస్తే రెండు రోజులకు జలమండలి ట్యాంకర్ డెలివరీ అవుతుండగా, ప్రైవేట్ ట్యాంకర్లు సకాలంలోనే సరఫరా చేస్తున్నా ఇష్టారాజ్యంగా డబ్బులు దండుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. జలమండలి వారు ఇంటింటికీ చేస్తున్న సరఫరా లో ప్రెషర్ తో వస్తుండడంతో ఏ మాత్రం సరిపోవడం లేదని అనేక మంది ఫిర్యాదు చేస్తున్నారు. అత్యవసరం అయిన వారు ట్యాంకర్‌ను బుక్ చేసిన తరువాత రెండు రోజులకు వస్తే అప్పటివరకు ఎలా జీవించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గండిపేట నీరు అందుబాటులోకి వచ్చినా..

మణికొండ మున్సిపాలిటీకి గతంలో కేవలం మంజీరా నీటిని మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం 2 రోజుల నుంచి గండిపేట నీటిని మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేసి ట్యాంకర్లను అందుబాటులోకి తెచ్చారు. అయినా ట్యాంకర్ల సరఫరాకు రెండు రోజులు పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలమండలి ఉన్నతాధికారులు 24 గంటల పాటు ట్యాంకర్లను డిమాండ్ మేరకు సరఫరా చేస్తున్నామని ప్రకటిస్తున్నా అది క్షేత్ర స్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ట్యాంకర్లను కట్టడి చేయండి..

మణికొండ మున్సిపాలిటీ ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. దాంతో వారు డిమాండ్‌ను బట్టి ఒక్కో ట్యాంకర్‌కు రూ. 900ల నుంచి ఏకంగా రూ.1500ల వరకు దండుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేసి నీటి వ్యాపారం చేస్తున్న వారిని రెవెన్యూ, మున్సిపల్, జలమండలి అధికారులు కట్టడి చేయాలని వారు కోరుతున్నారు. అలాగే వారు సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరిశీలించడంతో పాటు ఒక్కో ట్యాంకర్‌కు రూ. 700లు మాత్రమే వసూలు చేసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని, అలా చేయని వారి ట్యాంకర్లను సీజ్ చేయాలని వారు కోరుతున్నారు.

డిమాండ్ పెరిగింది..

మణికొండలో ఇంతకుముందు 5 ట్యాంకర్లు ఉండగా వాటిని 19 కి పెంచి ఫిల్లింగ్ కేంద్రాలను సైతం సరిపడా పెంచినం. అత్యధికంగా బోర్లు వట్టిపోవడంతో ఎక్కువ మంది ట్యాంకర్ డెలివరీ కాగానే తిరిగి బుక్ చేస్తుండటంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. గతంలో రోజుకు 80 ట్యాంకర్ల డిమాండ్ ఉండగా ప్రస్తుతం 300లకు పెరిగింది. రెండు ఫిల్లింగ్ కేంద్రాల్లోనూ మరో రెండు పాయింట్లు పెంచాం. దాంతో శనివారం బుకింగ్ చేస్తే సోమవారం మధ్యాహ్నం వరకు సరఫరా చేసి ఆ తరువాత ఆదివారం బుకింగ్స్‌కి సరఫరా చేస్తున్నాం. నీటి లభ్యత పెరగడంతో మరిన్ని ట్యాంకర్ల పెంపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

–స్ఫూర్తిరెడ్డి, మేనేజర్, జలమండలి

చెత్తను డంప్ కేంద్రాల్లో ప్రాసెస్ చేయాలి


నార్సింగిలో చెత్త డంప్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మణికొండ: ఇండ్ల నుంచి వస్తున్న చెత్తతో పాటు రోడ్లు, వ్యాపార సంస్థలు, నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా వాటిని డంప్ కేంద్రాలకు తీసుకువచ్చి ప్రాసెసింగ్ చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పెషల్ కమిషనర్ షఫీవుల్లా అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఉన్న డంప్ కేంద్రంలో కొనసాగుతున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త పేరుకుపోతే వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందని, దీంతో దుర్వాసనతో ప్రజలు అనారోగ్య బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రతిరోజు శానిటేషన్ పనులు సక్రమంగా జరిగేలా అధికారులు చూడాలన్నారు. ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించడం, నిర్మాణ వ్యర్థాలను మున్సిపాలిటీలకు అప్పగించే వ్యవస్థలను పెంపొందించాలని సూచించారు. ఆయన వెంట స్వచ్ఛభారత్ మిషన్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ, నార్సింగి మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య విభాగంలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయ పారిశుధ్య విభాగంలో మున్సిపల్ విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా 16 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. గతంలో సీఎస్‌గా సోమేశ్ కుమార్ విధులు నిర్వహించిన సమయంలో 21 మంది కార్మికులను సీఎస్ గ్రూపు పేరిట పారిశుధ్య పనులు నిర్వహించేందుకు తీసుకున్నారు. దీనికి జోనల్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకొని 21 మందికి ప్రతిరోజు రూ.620ల చొప్పున చెల్లించేందుకు నిర్ణయించారు. ఐదారేళ్లుగా 21 మందికి రూ.620ల చొప్పున డబ్బులు చెల్లిస్తున్నారు. అయితే వీరిలో కేవలం 16 మంది కార్మికులు మాత్రమే పనులు నిర్వహిస్తున్నారు. మిగిలిన వారు ఎవరన్నది సోమవారం నిర్వహించిన తనిఖీల్లో తేలలేదు. దీంతో పాటు వీరికి కేవలం రూ.330లు మాత్రమే ఇస్తూ పనులు నిర్వహిస్తున్నారు. ప్రతినెల కేవలం రూ.10 వేలు జీతం ఇచ్చి పనులు చేపట్టినట్లు విచారణలో తేలింది. వీరికి ఎలాంటి ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు లేవు. 16 మంది స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అధికారులు అనంతరం వెనుదిరిగారు. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని గ్రేటర్ కమిషనర్‌కు అందజేయనున్నట్లు సమాచారం.

కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి : ఏఐటీయూసీ

ఆరేళ్లుగా కార్మికుల పొట్టకొట్టిన కాంట్రాక్టర్‌తో పాటు అధికారులపై చర్యలు తీసుకొని వారి నుంచి డబ్బులు రికవరీ చేసి కార్మికులకు అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. విజిలెన్స్ తనిఖీలు చేస్తున్నారని తెలియడంతో ఆయన కార్యాలయానికి వచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎస్ గ్రూపు పేరిట ఆరేళ్లుగా పని చేయించుకొని డబ్బులు సైతం పూర్తి స్థాయిలో ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పుడు విజిలెన్స్ తనిఖీల నేపథ్యంలో 16 మంది కార్మికులకు ఉద్యోగాలు లేవని.. రావాల్సిన అవసరం లేదని చెప్పడం దారుణమన్నారు. 16 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉగాదికి ఆలయాల ముస్తాబు


రాజేంద్రనగర్ సర్కిల్‌లో ముస్తాబైన ఆలయం

రాజేంద్రనగర్: ఉగాది పండుగకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. పంచాగ పఠనం కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే టెంపుల్స్‌ను రంగురంగుల విద్యుద్దీపాలతో పాటు పూలతో అందంగా అలంకరించారు. ఉదయం పూజల అనంతరం పంచాగ పఠనాన్ని చేపట్టనున్నారు. ప్రధానంగా రాజేంద్రనగర్, బుద్వేల్, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి ప్రాంతాల్లోని ఆలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

నీటి సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి

బండ్లగూడ: ప్రజలకు నీటి సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్, మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలిగిన జూనియర్ అసిస్టెంట్ కిష్టయ్య ఫోన్ నంబర్ 912110651ను సంప్రదించాలని ఆయన సూచించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


చెత్తను కార్మికులకు అందించాలని సూచిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 3,15,16 డివిజన్‌లో తడి, పొడి చెత్త సేకరణను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్ జవాన్లు ఆటో రిక్షా కార్మికులు 100 శాతం చెత్త సేకరించేలా పని చేయాలన్నారు. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా చూడాలని ఆదేశించారు. ఓపెన్ పాయింట్లను పూర్తిగా ఎలిమినేట్ చేయాలని సూచించారు. అలాగే ఇంట్లోని చెత్తను ఆటో రిక్షా కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేశ్, శానిటరీ జవాన్లు, సాట్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: ఆకలితో ఉన్నవారికి ప్రతి అమావాస్య రోజు అన్నదానం చేసి ఆదుకుంటున్నామని మణికొండ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. సోమవారం అమావాస్య కావడంతో అలాపూర్‌టౌన్‌షిప్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి ఇస్తే ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు. అసోసియేషన్ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో వీరంగం

ఇద్దరిపై దాడి

అత్తాపూర్: గంజాయి మత్తులో కొందరు యువకులు వీరంగం సృష్టించిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు హసన్‌నగర్‌లోని బిస్మిల్లా ఖాన్ హోటల్ సమీపంలో ఓ ఇంటిముందు నిలబడి గంజాయి తాగుతుండగా ఆ ఇంట్లో ఉంటున్న అన్నదమ్ములు వారిని వారించారు. దీంతో రెచ్చిపోయిన వారు ఇంటిపై రాళ్లతో దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితులను ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

శంషాబాద్: ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు సూచించారు. పట్టణంలోని మహిళా మండలి ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన కార్యక్రమంలో బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు ఓటర్లను చైతన్యపర్చాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ అధికారులు స్వర్ణలత, ఉమేశ్, ఎన్విరాన్ మెంటల్ ఇంజినీర్ అనిల్, మహిళా సంఘాలు, నగరదీపికలు తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ సభ్యులపై కేసు నమోదు

మియాపూర్: అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని కేఎస్ఆర్ –2 గెదర్‌మెంట్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఓ మహిళ అసోసియేషన్ సభ్యులు, అధ్యక్షుడు, కోశాధికారి కార్యదర్శులు అసభ్య, పరుష పదజాలంతో దూషించడంతోపాటు వేధింపులకు గురిచేశారంటూ మియాపూర్ పోలీసులను ఆశ్రయించి వారిపై ఫిర్యాదు చేసింది. ఫ్లాట్ నంబర్ 901లో తులసి భర్త చనిపోవడంతో ఆమె కుమారుడితో కలిసి ఉంటోంది. కొద్ది రోజుల నుంచి కమ్యూనిటీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వసంత్‌రెడ్డి, కార్యదర్శి రాజు తులసిని టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారు. ఆమె ఫ్లాట్‌లో పనిచేయడానికి వచ్చే పనివారిని సైతం అపార్ట్‌మెంట్‌లోకి రానివ్వకుండా అడ్డుకోవడం, పార్కింగ్ ప్రదేశాల్లో కారు పెట్టనివ్వకపోవడం, వ్యక్తిగత విమర్శలు చేస్తూ వేధించసాగారు. దీంతో తులసి ఈ నెల 6వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన సీఐ దుర్గ రామలింగప్రసాద్ అపార్ట్‌మెంట్ సభ్యులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి : మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస కాలనీలో డాక్టర్ అన్వర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఖర్జూర పండును తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సభ్యులు అలీం పాషా, పాషా, సనాఉల్లా, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనానికి తరలిన బీజేపీ నాయకులు


బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: చేవెళ్ల బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రటరీ వై.శ్రీధర్ మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని బూత్ అధ్యక్షులకు దిశా, నిర్దేశం చేశారన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వినీతా రెడ్డి, మూల శ్రీనివాస్ గౌడ్, హరికిషన్, జి.నాగమణి, బి.బాలకృష్ణ, స్వప్న రెడ్డి, మల్లేశ్ చారి, విఠల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

శేరిలింగంపల్లి: విద్యార్థులు దేశభక్తి, సేవాభావాన్ని అలవర్చుకోవాలని, ప్రపంచంలో ఏ దేశానికి లేని యువ శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) జాతీయ అధ్యక్షులు ఆదర్శకుమార్ గోయల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత్ వికాస్ పరిషత్ నమో గంగా గచ్చిబౌలి బ్రాంచ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీ విద్యాంజలి హైస్కూల్‌లో అనిమియా ముక్త్ భారత్ ప్రోగ్రాంను సోమవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..


మీర్ ఖాజామ్ అలీఖాన్

మియాపూర్: దొంగతనాలు చేసి జైలుకు వెళ్లివచ్చాక కూడా ప్రవర్తన మార్చుకోకుండా మరలా దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ దుర్గ రామలింగప్రసాద్, డీఐ అక్రమ్ బాబా తెలిపిన వివరాల ప్రకారం...నగరంలోని టోలిచౌక్‌లోని సూర్యనగర్ కాలనీకి చెందిన మీర్ ఖాజామ్ అలీఖాన్ అలియాస్ సూర్యభాయ్(30). స్థానికంగా ఓ హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కొన్ని సంవత్సరాలుగా తాళంవేసిన ఇళ్లను పరిశీలించి ఎవరూ లేని సమయంచూసి సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 12 గంటల మధ్యలో ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, నగదు ఇతర విలువైన వస్తువులను ఎత్తుకెళ్లేవాడు. ఈ క్రమంలో ఇతనిపై 88 కేసులుండగా జైలుకు వెళ్లివచ్చాడు. జైలుకు వెళ్లివచ్చాక కూడా 12 కేసులు నమోదయ్యాయి. కాగా మియాపూర్ ఆల్విన్‌కాలనీలో మొవ్వా సాయికృష్ణ కుటుంబం నివసిస్తోంది. మార్చి 20వ తేదీ అతని భార్య పిల్లలతో కలిసి విజయవాడ వెళ్లింది. సాయి కృష్ణ ఒక్కడే ఉంటున్నాడు.22వ తేది సాయికృష్ణ ఉదయం 8 గంటలకు ఉద్యోగానికి వెళ్లి అదేరోజు రాత్రి 11.30 గంటలకు ఇంటికి వచ్చేచూసేసరికి వంటగది తలుపులు పగులగొట్టి ఉండడం గమనించాడు. ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతో పరిశీలించగా అందులో ఉన్న 100 గ్రాముల బంగారు బిస్కెట్లు, రూ.50వేల నగదు ఇతర బంగారు ఆభరణాలు దొంగతనం జరిగిందని గ్రహించాడు. 23వ తేదీ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ మేరకు మియాపూర్ కూడలివద్ద ఈ నెల 6వ తేదీ సాయంత్రం వాహనాల తనిఖీలు చేస్తుండగా అటువైపు వచ్చిన మీర్ ఖాజామ్ అలీఖాన్‌ను అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఇతనికి దొంగతనాల్లో సల్మాన్,రియాజ్ అనే ఇద్దరు వ్యక్తులు సహకరిస్తుండేవారని వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దీంతో అతన్ని పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్దనుండి 36 తులాల బంగారం, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చికెన్ 65 లో పురుగు


చికెన్‌లో వచ్చిన పురుగు


జరిమానా రసీదు అందజేస్తున్న హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య

శంషాబాద్: పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న కినారా గ్రాండ్ హోటల్‌లో వినియోగదారుడు తీసుకున్న చికెన్ 65 బిర్యానీలో పురుగు రావడంతో మున్సిపాలిటీ అధికారులుకు ఫిర్యాదు చేశాడు. దీంతో మున్సిపల్ హెల్త్ అధికారులు అక్కడికి వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు. దీంతో సదరు హోటల్ యజమాన్యానికి అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. నాణ్యత లేని ఆహారాన్ని అందించినందుకు హోటల్ యజమాన్యానికి హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య రూ. 10 వేల జరిమానా విధించారు. కల్తీ ఆహార పదార్థాలను అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సిసిరో అకాడమీలో ప్రపంచస్థాయి శిక్షణ

కార్పొరేట్ క్వీన్ మిసెస్ ఇండియా– 2024 డా.ప్రీతి అదుసుమిల్లి



మాదాపూర్: ప్రతిష్ఠాత్మకమైన కార్పొరేట్ క్వీన్ మిసెస్ ఇండియా 2024, క్లాసిక్ మిసెస్ ఇండియా 2024 క్రౌన్ విన్నర్ కిరీటాన్ని డాక్టర్ ప్రీతి అదుసుమిల్లి పొందారు.మిసెస్ ఇండియా పేజెంట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఇటీవల గుర్గావ్‌లో జరిగాయి. కాగా మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ సిసిరో అకాడమీలో మహిళలకు మేక్ ఓవర్, గ్రూమింగ్, హెయిర్ స్టైలిస్ట్, బ్యూటీషియన్, అడ్వాన్స్‌డ్ కాస్మోటాలజీలో మూడు నగరాలలో విద్యార్థులకు ప్రపంచస్థాయి శిక్షణతో పాటు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నట్టు తెలిపారు. 30 రోజుల కోర్సు నుంచి 3 సంవత్సరాల డిప్లొమా కోర్సు వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్, డాక్టర్లు పాల్గొన్నారు.